క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: కాజీపేటలోని పలు ప్రాంతాల్లో ఈనెల 26న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాజీపేట మెయిన్ రోడ్డు, సెయింట్ థామస్ స్కూల్ వీధి, ఉప్పలయ్య హోటల్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కార్మికుల ఐక్యతను సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవి

కరీమాబాద్: కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా కార్మికుల ఐక్యతను సాధించాల్సిన అవసరం ఉందని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి సూచించారు. ఉర్సుగుట్ట ఆర్ఎస్ భవన్‌లో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశానికి సాగర్ అధ్యక్షత వహించగా మాధవి హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో అసంఘటిత రంగ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నారని వాపోయారు. ఈ క్రమంలోనే బీజేపీ మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, యాదగిరి, రాధిక, షాజియా, ప్రభాకర్, ఓదెలు, దివ్య, కిరణ్, మహబూబ్, సదానందం, రమేష్, రవీందర్ పాల్గొన్నారు.

బస్తీ పిల్లలకు సమ్మర్ క్యాంపు



హన్మకొండ అర్బన్: నిరుపేద పిల్లల్లో సృజనాత్మక పెంపొందించేందుకు విద్యా వికాస ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలసముద్రంలోని అంబేడ్కర్ బస్తీలోని పిల్లలకు గురువారం సమ్మర్ క్యాంపు ప్రారంభించినట్లు వరంగల్ ఆర్ట్ సొసైటీ సభ్యులు, డ్రాయింగ్ మాస్టర్ సుధాకర్, క్రాఫ్ట్ మాస్టర్ జ్యోతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్తీ పిల్లలలో సృజనాత్మకతను పెంపొందించేదుకు ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. అనంతరం పిల్లలకు డ్రాయింగ్, క్రాఫ్ట్ పరికరాలను అందించారు. కార్యక్రమంలో ప్రేరణ ఫౌండేషన్ సభ్యులు, వరంగల్ ఆర్ట్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్


చేపలను వీక్షిస్తున్న ప్రజలు

హన్మకొండ అర్బన్: నగరంలోని హయగ్రీవాచారీ కుడా మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సముద్రగర్భంలో ఉండి చేపలను తిలకించినట్లుగా ఎంతో వ్యయప్రయాసాల కోర్చి నిర్వాహకులు 500 రకాల చేపలను ప్రదర్శనలో ఉంచారు. అలాగే, వివిధ రకాల తినుబండారాలు, ఇటాలియన్ అమ్యూజ్‌మెంట్ పార్కు, గృహోపకరణ వస్తువులు ఉన్నాయి.

అశ్రిత్‌కు టీఎన్జీవోస్ అభినందన

హన్మకొండ అర్బన్: సివిల్స్ ర్యాంకర్ శ్రీసాయి అశ్రిత్‌ను టీఎన్జీవోస్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్మోహన్‌రావు అధ్యక్షతన టీఎన్జీవోస్ నాయకులు గురువారం అభినందించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జనగామ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజద్ అలీ, ప్రవీణ్‌కుమార్, సంపత్‌కుమార్, సంజీవరెడ్డి, గెజిటెడ్ పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు హసన్, సురేష్‌కుమార్, మాధవరెడ్డి, రాజేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

హసన్‌పర్తి: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీసును క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు హసన్‌పర్తి మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు రేనుకుంట్ల సునీత, ఎంపీడీఓ రామకృష్ణ, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు బండి రజనీకుమార్, పీఏసీఎస్ చైర్మన్ మేర్గు రాజేష్, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అలరించిన రిహార్సల్స్

హన్మకొండ కల్చరల్: తిరుపతికి చెందిన అభినయ ఆర్ట్స్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న హనుమ అవార్డు పోటీల్లో వరంగల్ స్టార్ బ్రదర్స్ సాంస్కృతిక కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రదర్శించనున్న విజయానిరుద్ధం పద్య నాటకం ప్రాథమిక ప్రదర్శన అలరించింది. భీమారంలోని బ్రాహ్మణ సంఘంలో జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను పోటీల నిర్వాహకులు బీఎస్.రెడ్డి అభినందించారు.

ప్రజల చిరకాల వాంఛ దిశగా అడుగులు

- కాజీపేట చౌరస్తా అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం
- జీరో సర్కిల్ చేయాలని కోరుతున్న ప్రజలు


కాజీపేట చౌరస్తాలో కొలతలు తీస్తూ..


వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

కాజీపేట: కాజీపేట పట్టణ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న చౌరస్తా అభివృద్ధి పనుల కల త్వరలో నెరవేరబోతుంది. ఇటీవల ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్‌తో పాటు కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్యతో కలిసి కాజీపేట చౌరస్తాలో రాష్ట్ర మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవిందకుమార్ పర్యటించి అభివృద్ధి పనులు చేపట్టడానికి గల అవకాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్, కుడా ఇంజనీరింగ్ అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈమేరకు ఇంజనీరింగ్ అధికారులు చౌరస్తాలో ఉన్న స్థలం, చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు కావాల్సిన స్థలం ఎంత అనే అంశాలపై గురువారం కొలతలు తీసుకుంటున్నారు. కాజీపేట చౌరస్తాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు తయారు చేసే పనిలో ఇంజనీరింగ్ అధికారులు నిమగ్నమయ్యారు. వరంగల్ నగరానికి ముఖ ద్వారంగా ఉన్న కాజీపేట చౌరస్తాలో అభివృద్ధి పనులు లేక జంక్షన్ బోసిపోయి కనిపిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు తలమానికంగా ఉన్న అతి పెద్ద రైల్వే జంక్షన్ ఈ చౌరస్తాకు కూతవేటు దూరంలోనే ఉన్నా అభివృద్ధి మాత్రం శూన్యం.

ప్రజల ఆకాంక్ష మేరకు..

కాజీపేట చౌరస్తాను అభివృద్ధి చేయాలనే ప్రజల చిరకాల వాంఛను గుర్తించిన స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్.. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి సమస్య తీవ్రతను తీసుకెళ్లి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే అభిలాష మేరకు ప్రత్యేకంగా నిధులను మంజూరు చేయడానికి మంత్రి సంసిద్ధత వ్యక్తం చేయడంతో అధికారుల్లో వేగం పెరిగింది. ఇంజనీరింగ్ అధికారులు రంగంలోకి దిగి చౌరస్తాలో ఖాళీ స్థలం కొలతను సేకరించడంతో పాటు ఏ విధంగా పనులు చేపట్టాలనే అంశంపై నివేదికలను సిద్ధం చేస్తున్నారు.

జీరో సర్కిల్‌తో మేలు

కాజీపేట చౌరస్తా అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా ఉన్న భవనాలను తొలగించి జీరో సర్కిల్ రూపంలో అభివృద్ధి చేయడం ఉత్తమంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాజీపేట బాలికల ఉన్నత పాఠశాల నుంచి ఫాతిమానగర్ ఫ్లెటైవర్ బ్రిడ్జి వరకు రహదారికి ఇరువైపులా రోడ్డును విస్తరించడం వల్ల అభివృద్ధి పనులు చేయడానికి వీలవుతుంది. భవిష్యత్తు తరాలకు రవాణా అవసరాలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి.

కడిపికొండలోని భూమి దళితులదే!


రాస్తారోకో చేస్తున్న వారిని నిలువరిస్తున్న పోలీసులు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని సర్వే నంబర్ 366లోని 32 ఎకరాల పంచరాయి భూమి కడిపికొండకు చెందిన దళితులదేనని 44వ డివిజన్ కార్పొరేటర్ జలగం అనిత తెలిపారు. ఈమేరకు బైపాస్ రోడ్డుపై దళితులు గురువారం ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అనిత మాట్లాడుతూ 1994లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం కడిపికొండకు చెందిన 64మంది దళితులకు 32ఎకరాల పంచరాయి భూమిని కేటాయించగా, దళితులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఆ భూమిని టీఎన్జీవోస్ ఉద్యోగులతో వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, నాటి జాయింట్ కలెక్టర్ వాకాటి కరుణ.. లోపాయికారీ ఒప్పందం చేసుకుని అప్పగించారని ఆరోపించారు. కాగా, రాస్తారోకోతో ఖమ్మం బైపాస్ రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో కాజీపేట, మడికొండ పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం, డివిజన్ అధ్యక్షుడు చెన్నబోయిన శివకుమార్, బీజేపీ నాయకులు జలగం రంజిత్, బన్న ప్రభాకర్, బండి సాంబయ్య, పానగోటి వెంకట్‌రావు, గడ్డం మహేందర్, బిల్లా యాదవరెడ్డి, నాయిని కుమార్, టాటాచారి, నిఖిల్‌రావు, కిరణ్, కడిపికొండ దళిత సంఘం నాయకులు బస్కె రవి, వెంకట్, నాగరాజు, రాజయ్య, లక్ష్మి, భాగ్య, రత్నకుమారి పాల్గొన్నారు.

ఉద్యమాలకు ఊపిరిలూదిన కళాకారులు



మాట్లాడుతున్న సారయ్య

హన్మకొండ చౌరస్తా: దేశ స్వాతంత్ర్య నుంచి నేటి తెలంగాణ మలిదశ ఉద్యమం వరకు ప్రజలను చైతన్య పరిచిన ఘనత కేవలం కళాకారులకే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే పోతురాజు సారయ్య అన్నారు. హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల జంక్షన్‌లోని బీఆర్.భగవాన్‌దాస్ విగ్రహం వద్ద ప్రజానాట్య మండలి జెండాను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజానాట్య మండలి కళాకారులు కాళ్లకు గజ్జెకట్టి, భుజంపై గొంగడి వేసుకుని ప్రజలను చైతన్యవంతులను చేస్తూ సాయుధ పోరాటంలో ఉద్యమాలు చేశారని కొనియాడారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన నిజమైన కళాకారులను గుర్తించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇప్పటికైనా నిజమైన కళాకారులను గుర్తించి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కొట్టెపాక రవి, బాధ్యులు కర్రె భిక్షపతి, అంబి సాంబయ్య, రాజేందర్, అనూష, శిరీష, సరిత, శివకుమార్, గోపి, ఐలయ్య, భూషణం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్

హసన్‌పర్తి: ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురై వీధిన పడిన సీతంపేటకు చెందిన నేదునూరి సాంబయ్యను వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరు, నష్ట వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి డబుల్‌బెడ్రూం ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సాంబయ్యకు రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. అలాగే, అనారోగ్యంతో మృతి చెందిన సీతంపేటకు చెందిన బొౌతు లక్ష్మి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి రూ.5వేలు సాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతపాక సునీత, జెడ్పీటీసీ సభ్యురాలు రేనుకుంట్ల సునీత, సర్పంచ్ శరత్, ఎంపీటీసీ సభ్యురాలు బండారి రజిత, ఉపసర్పంచ్ భగవాన్‌రెడ్డి ఉన్నారు. ఇటీవల మృతి చెందిన హసన్‌పర్తికి వల్లాల రాజమ్మ, వల్లాల బక్కయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే రమేష్ ఓదార్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న బీఆర్ఎస్ నాయకుడు కందుకూరి సాయిచంద్‌ను పరామర్శించారు.

స్వయం ఉపాధికి బ్యూటీషియన్, టైలరింగ్ దోహదం


మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

వరంగల్ చౌరస్తా: మహిళా సాధికారతకు బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తెలిపారు. వరంగల్ 27వ డివిజన్ పరిధిలో బాపూజీ విజ్ఞాన కేంద్రంలో శిక్షణ తీసుకున్న మహిళలకు సర్టిఫికెట్లను గురువారం పంపిణీ చేశారు. సిరి స్వచ్ఛంద సంస్థ, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం సౌజన్యంతో కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సిరి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పరికి సుధాకర్, కార్పొరేటర్ చింతాకుల అనిల్, జయశ్రీ, ఆర్.ధనలక్ష్మి, పోలెపాక లక్ష్మి, ఎల్‌సీపీఓ సురేష్ పాల్గొన్నారు.

మేయర్‌ను అవమానించిన వారికి గుణపాఠం తప్పదు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

రామన్నపేట: పద్మశాలి ఆడపడుచు, నగర ప్రథమ పౌరురాలు గుండు సుధారాణిని అవమానించిన తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అనుచరులకు గుణపాఠం తప్పదని పద్మశాలి చేనేత సంఘం అధ్యక్షుడు చిప్ప వెంకటేశ్వర్లు హెచ్చరించారు. కొత్తవాడలోని చేనేత సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం కొత్తవాడతో చేనేత బెడ్‌షీట్లు, కార్పెట్లు ఖరీదు చేయాలని మేయర్ సుధారాణి పేరు మీద లెటర్ వచ్చిందని గుర్తుచేశారు. అయితే, ఈ విషయాన్ని కప్పిపుచ్చి ఇది తన ద్వారానే సాధ్యమైందని ఎమ్మెల్యే పేర్కొంటూ అధికారులు వేయాల్సిన స్టాంప్‌ను ఎమ్మెల్యే స్వయంగా వేయడం సమంజసమేనా అని ప్రశ్నించారు. చేనేత కార్మికులకు బాండ్ల పంపిణీ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో మేయర్ ఫొటో చిన్నగా వేసి, ఇతర కుల సంఘాల నాయకులు ఫొటోలు పెద్దగా పెట్టడం వంటివి మేయర్‌ను అవమానించినట్లే ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో వరంగల్ అధ్యక్షుడు ఆడెపు రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వొడ్నాల నరేందర్, పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ ఎలగం శ్రీనివాస్, జి.రాజు, ప్రొఫెసర్ వరంగిరి సూర్యనారాయణ, అశోక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

కోకాపేట భవన భూమిపూజకు తరలిరావాలి


మామునూరు: బియ్యం అందజేస్తున్న రవీందర్

వరంగల్ చౌరస్తా: హైదరాబాద్‌లో ఈనెల 27న కోకాపేటలో భవన నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి చేనేత కార్మికులు, పద్మశాలి కుటుంబ సభ్యులు, పరపతి సంఘాలు, సొసైటీ ప్రతినిధులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్ కోరారు. ఈమేరకు వరంగల్ చార్‌బౌళిలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో వరంగల్ జిల్లా సంఘం ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది.

అనాథ వృద్ధులకు అండగా ఉంటా..

మామునూరు: అనాథ వృద్ధులకు అండగా ఉంటానని ఆడెపు రవీందర్ అన్నారు. నక్కలపెల్లి గ్రామ శివారులోని వాసవి చారిటబుల్ ట్రస్టు, ఎలగందుల అమృత స్మారక వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా 2బస్తాల బియ్యం, పండ్లను ఆశ్రమ నిర్వాహకులు ఎలగందుల లక్ష్మీనారాయణకు అందజేశారు.

డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖిలా వరంగల్: భారత ప్రభుత్వ రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ చెర్లపల్లి హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉన్నత సాంకేతిక విద్య, ప్రధాన విద్యాసంస్థ ప్లాస్టిక్, అనుబంధ పరిశ్రమల శిక్షణ సంస్థ నేతృత్వంలో నిర్వహించే డిప్లమో ప్రోగ్రామ్స్ ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ కోర్సులకు టెన్త్, డిప్లమో, బీఎస్సీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెంటర్ ఫర్ స్కిల్లింగ్ అండ్ టెక్నికల్ సపోర్ట్, సీఐపీఈటీ హైదరాబాద్ ప్రిన్సిపల్ డైరెక్టర్ డాక్టర్ బి.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 96772 56436, 80931 40230 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

హజ్ యాత్రికులకు 30న అవగాహన సదస్సు

ఖిలా వరంగల్: ఈనెల 30న ముస్లిం, మైనార్టీ, ఆరోగ్యశాఖ, హజ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్ పోచమ్మమైదానంలోని అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో హజ్ యాత్రికుల అవగాహన సదస్సు, టీకా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఖిలా వరంగల్ ఈద్గా అధ్యక్షుడు ఎంఏ.జబ్బార్ తెలిపారు. వరంగల్ ఎస్ఆర్ఆర్‌తోటలోని కరీమాబాద్ రోడ్డులో హజ్ సొసైటీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.సర్వర్ మొహినొద్దీన్ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో జబ్బార్ మాట్లాడారు. జూన్ 7న హజ్ యాత్రకు పలు దఫాలుగా వెళ్లేందుకు జిల్లా నుంచి 110 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి ఆరుగురికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని వివరించారు. వారందరికి హజ్ యాత్రపై అవగాహన కల్పించి, ప్రతీ యాత్రికుడికి టీకా (వ్యాక్సినేషన్) వేయించి వైద్యశాఖ నుంచి వ్యాక్సినేషన్ సర్టిఫికెట్ అందించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, కలెక్టర్ ప్రావీణ్య, నగర కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, వైద్యశాఖ, వక్ఫ్ బోర్డ్, ముస్లిం, మైనార్టీ శాఖ, అధికారులు హాజరు కానున్నారని వివరించారు. సమావేశంలో వాహిద్ గుల్షన్, ఎస్ఎం.సహిద్, మహ్మద్ అమ్జద్, హసన్ అలీబేగ్, ఇబ్రహీం, మాసూక్ పాల్గొన్నారు.

న్యూశాయంపేట: హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు ఈనెల 30న నగరంలోని ఎల్బీనగర్‌లోని అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వరంగల్ హజ్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ సర్వర్ మొహినుద్దీన్ ఘూజి తెలిపారు.

యాత్రికులకు వ్యాక్సినేషన్

వరంగల్: వరంగల్ జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం యాత్రికులకు ఉచితంగా వాక్సినేషన్ వేసేందుకు ఈనెల 30న అబ్బూస్ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు.

నగరాభివృద్ధిపై సర్కారు ప్రత్యేక దృష్టి


పనులను ప్రారంభిస్తున్న విజయ్‌భాస్కర్

హన్మకొండ: వరంగల్ మహానగరం అభివృద్ధిపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ స్నేహనగర్‌లో 58వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్మడి లోహితతో కలిసి సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఇమ్మడి రాజు, ఆకుల మధుకర్, నీలం సుహాస్, స్నేహనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఖండేరావు నర్సింహారావు (చిన్న), కాలనీ కమిటీ సభ్యులు కుసుమ వెంకట్రాం నరసింహారావు, బట్టు శశికాంత్ రెడ్డి, కాటుక బాలరాజు, ధర్మా తిరుపతిరెడ్డి, గుండా వాసుదేవ్, ఎన్నమనేని చలపతిరావు, నెలకుర్తి నారాయణరెడ్డి, రాంబ్రహ్మం, మంగు నవీన్, వీరమల్ల మనోహర్, సత్యనారాయణ, మహేందర్ రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఐపీటీఏ 80వ ఆవిర్భావ దినోత్సవం


జెండాను ఆవిష్కరిస్తున్న షేక్ బాషుమియా

ఖిలా వరంగల్: ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఐపీటీఏ) 80వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో సంఘ నిర్మాణ బాధ్యుడు గన్నారపు రమేష్ ఆధ్వర్యంలో గురువారం వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా హాజరై ఇప్టా జెండాను ఆవిష్కరించారు. అనంతరం మదాల రంగారావు చిత్రపటానికి పూలమాల వేసి 75వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాషుమియా మాట్లాడుతూ 1943లో బొంబాయిలో జర్మనీ ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమం నుంచి ఐపీటీఏ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు దామోదర కృష్ణ, మున్ని, సుప్రియ, హరిబాబు, సాంబలక్ష్మి, రేణుక, మంజుల, జన్ను రాజు, దస్సు, శారద, వసంత, శాంత, స్వప్న, రజిత, నీలిమ, కవిత, కల్యాణి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న 1,335 మంది కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కాంటాక్ట్ అధ్యాపకుల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు ఎమ్మెల్సీ, తెలంగాణ భవన సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లో గురువారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి, కేయూ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ తెలిపారు.

రక్తదాత సుమన్‌కు అభినందనలు

హన్మకొండ అర్బన్: నగరంలోని జీవన్ వాలంటరీ బ్లడ్ బ్యాంకులో యువ నేతాజీ ఫౌండేషన్ సభ్యుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ గురువారం 16వ సారి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనేక సార్లు స్వచ్ఛందంగా రక్తదానం, సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న సుమన్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో యువ నేతాజీ ఫౌండేషన్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్‌కుమార్, కానిస్టేబుల్ కన్నె రాజు, సంతోష్, కమలాకర్, అశోక్, పృథ్వీ, రాంప్రసాద్, సృజన, విష్ణు, వైనాల రమేష్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

న్యాక్ టీంను కలిసిన బీఆర్ఎస్వీ బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి గురువారం వచ్చిన న్యాక్ పీర్‌టీం చైర్మన్ ప్రొఫెసర్ సుగమ్ఆనంద్‌ను బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, బాధ్యులు కలిసి బొకే అందించారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీకి ఎంతో గొప్పచరిత్ర ఉందని, విద్యాపరంగా, పరిశోధనల పరంగా ముందుకెళ్తోందని చైర్మన్ దృష్టికి ప్రశాంత్ తీసుకెళ్లారు. చైర్మన్‌ను కలిసిన వారిలో టీఆర్ఎస్వీ కేయూ బాధ్యులు డాక్టర్ కొమురయ్య, కలకోట్ల సుమన్, వినోద్, శివ తదితరులున్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


విద్యార్థులతో ఇన్‌స్పెక్టర్ రాజు, స్కూల్ ప్రిన్సిపాల్ అరుణ్‌ప్రకాష్

కాజీపేట రూరల్: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని కాజీపేట ఇన్‌స్పెక్టర్ సార్ల రాజు సూచించారు. కాజీపేట సెయింట్ గాబ్రియల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ బ్రదర్ అరుణ్ ప్రకాష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ క్రీడలపై ఏర్పాటు చేసిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా అరుణ్‌ప్రకాష్ మాట్లాడుతూ ఏప్రిల్ 25నుంచి మే 25వ తేదీ వరకు ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, షటిల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, వెస్టర్న్ డ్యాన్స్, అథ్లెటిక్స్ విభాగాల్లో ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతిభ కనబరిచిన 200మంది విద్యార్థులు, పీడీ విజయ్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో బ్రదర్ స్లీవారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఉరుములు.. మెరుపులు

- మూడు ప్రాంతాల్లో పిడుగు పాటు
- గాలి దుమారంతో విరిగిన విద్యుత్‌స్తంభాలు.. చెట్లు


పిడుగుపాటుకు మండుతున్న కొబ్బరి చెట్టు


జలమయమైన ఫారెస్ట్ కాలనీ

హసన్‌పర్తి: బుధవారం అర్ధరాత్రి గాలి దుమారం.. భారీ శబ్దంతో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కారణంగా నగరవాసులు భయాందోళనకు గురయ్యారు. హసన్‌పర్తి మండలంలోని మూడు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. మడిపల్లి, జయగిరి గ్రామాల్లో పిడుగుపాటుకు తాటిచెట్లు దెబ్బతిన్నాయి. హసన్‌పర్తి నుంచి జయగిరి వెళ్లే మార్గం, గంటూరుపల్లి సమీపంలో గాలి దుమారానికి విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. హసన్‌పర్తి మండల కేంద్రంలో చెట్టు నేలకొరగడంతో ఎద్దు మృత్యువాత పడింది. మరోవైపు భారీవర్షంతో కాలనీలు జలమయమయ్యాయి. భీమారంలోని ఫారెస్ట్ కాలనీలో వరద నీరు ఇళ్లల్లోకి చేరింది.

కాజీపేటలో చెట్టుపై పిడుగు

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ విజయనగర్ కాలనీలో గురువారం తెల్లవారు జామున ఎండీ.హుస్సేన్ అనే బీఆర్ఎస్ నాయకుడి ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగు పండింది. ఆ చెట్టు పూర్తిగా దగ్ధమైంది.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో టీచర్‌కు తీవ్రగాయాలు

విద్యారణ్యపురి: హనుమకొండలోని కలెక్టరేట్ ఎదురుగా రోడ్డు దాటుతున్న వి.సాయిలు అనే ఉపాధ్యాయుడిని గురువారం ఉదయం ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దాంతో అతనికి తీవ్రగాయాలు కాగా 108 అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగానే ఉన్నట్లు సాయిలు బంధువు ఒకరు గురువారం రాత్రి తెలిపారు. శ్యాయంపేట మండలం పత్తిపాక జెడ్పీహెచ్ఎస్‌లో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా సాయిలు పనిచేస్తున్నారు.


బ్యాండ్ వాయిద్యకారుల అరెస్ట్

వరంగల్ క్రైం: అర్ధరాత్రి సమయంలో ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా భారీ శబ్దాలతో బ్యాండ్ వాయిద్యాలను వాయిస్తున్న నలుగురు వాయిద్యకారులను అరెస్టు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. ఈమేరకు నక్క రాంజీ, ఎండీ.నూరుద్దీన్, కొండపర్తి విష్ణు, బండారి వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

హసన్‌పర్తి: విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందింది. చింతగట్టుకు చెందిన ముప్పిడి రజితకు చెందిన గేదె.. కెనాల్ సమీపంలో గురువారం మోతకు వెళ్లింది. విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే గేదె మృతి చెందిందని, ఆదుకోవాలని స్థానికులు కోరారు.

4న ఎంఎస్‌పీ జిల్లా సదస్సు


మాట్లాడుతున్న మందకుమార్

హన్మకొండ అర్బన్: జూన్ 4న ఎంఎస్‌పీ, ఎమ్మార్పీస్ ఉమ్మడి వరంగల్ జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు ఎంఎస్‌పీ జాతీయ నేత, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మందకుమార్ మాదిగ తెలిపారు. ఈమేరకు గురువారం హంటర్‌రోడ్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వేల్పుల సూరన్న, కాపు మందరాజు, కందికట్ల విజయ్, బిర్రు మహేందర్, గంగరపు శ్రీనివాస్, గొలి సుధాకర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈనెల 26 నుంచి 31 వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పర్యటించనున్నట్లు మందకుమార్ వివరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9505507575
9010299096 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
పి.చంద్రశేఖర్ (ACO) : 8074606274 (వరంగల్)
జి. రవియాదవ్ (ACO) : 9032782191 (హన్మకొండ)